## క్లుప్తంగా

### 21న సామాజిక తనిఖీ ప్రజావేదిక

కాటారం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 21 మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. 1 జూలై 2021 నుంచి 31 మార్చి 2023 వరకు మండలంలో ఉపాధిహామీ ద్వారా జరిగిన అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేపట్టి గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. తుది నివేదికలను ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ప్రజావేదికకు హాజరుకావాలని కోరారు.

### ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఆగస్టు -2023 సెషన్ కొరకు ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్స్‌లో మూడోదశ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. అభ్యర్థులు పదోతరగతి సర్టిఫికెట్ ప్రకారం ఆన్‌లైన్ దరఖాస్తులో వివరాలు నమోదు చేయాలని, సెల్ఫీ ఫొటోలు అప్‌లోడ్ చేస్తే దరఖాస్తు తిరస్కరించబడుతుందన్నారు. తప్పనిసరిగా పాస్‌పోర్టు సైజు ఫొటో మాత్రమే అప్‌లోడ్ చేయాలని సూచించారు.

### కిషన్‌రావుపల్లి ఫారెస్ట్‌కు అనుమతులు

మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల కిషన్‌రావుపల్లి అటవీ ప్రాంతం నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రం వరకు 7 కిలోమీటర్ల మేర రోడ్డ నిర్మాణానికి ఫారెస్ట్ అనుమతులు లభించినట్లు ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైద్రాబాద్‌లో జరిగిన ఫారెస్ట్ ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో అనుమతులు వచ్చినట్లు తెలిసిందన్నారు. అటవీశాఖ అనుమతులు రావడానికి కృషి చేసిన ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, కలెక్టర్ భవేష్ మిశ్రా, డీఎఫ్‌ఓ లావణ్యలకు మండల ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

### ఏటూరునాగారం తహసీల్దార్‌గా సంధ్యారాణి

ఏటూరునాగారం : స్థానిక తహసీల్దార్‌గా సంధ్యారాణిని నియమిస్తూ జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సంపేటలో డీటీగా పనిచేస్తున్న ఆమె ఎన్నికల బదిలీల నేపథ్యంలో పదోన్నతి కల్పిస్తూ ఇక్కడికి తహసీల్దార్‌గా నియమించారు. శుక్రవారం విధుల్లో చేరిన సంధ్యారాణిని ఆర్ఐ శ్రీనివాస్, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఇక్కడి పనిచేసిన వీరస్వామి మంగపేటకు బదిలీ అయ్యారు.

**పోలింగ్ స్టేషన్ పరిశీలన**

స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ సంధ్యారాణి పరిశీలించారు.ఆమె వెంట ఆర్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

మంగపేట: తహసీల్దార్‌గా బైరి వీరస్వామి బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్ రావు, ఏఆర్ఐ ఏసుపాదం, జూనియర్ అసిస్టెంట్ తళ్ళపెల్లి నందకిశోర్, సర్వేయర్ సఫీయాబేగం, కార్యాలయ సిబ్బంది పూల బొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### భవనాలు మంజూరు చేయాలి

వెంకటాపురం(ఎం): మండలంలోని వెంకటాపురం, నల్లగుంట, పాలంపేట, రామాంజాపూర్ గ్రామాల్లో గ్రామ సమాఖ్య భవనాలు నిర్మించాలని కోరుతూ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతికి శుక్రవారం మండల కేంద్రంలో ఆయా గ్రామాలకు చెందిన వీఓఏలు వినతిపత్రం అందించారు. మంత్రి సత్యవతిరాథోడ్ దృష్టికి తీసుకవెళ్లి భవనాల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసేవిధంగా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఓఏలు శెట్టి మంజుల, తైనవేని సరోజన, సాద రాజప్రమీల, రమ, సరళ, రెడ్డి వనమాల, అరుణ, జ్యోతి, హరిస్నాబేగం, రోష పాల్గొన్నారు.

### గృహలక్ష్మి దరఖాస్తులపై ఇంటింటి సర్వే

వెంకటాపురం (కె) : స్థానిక మేజర్ పంచాయతీలో శుక్రవారం గృహలక్ష్మి దరఖాస్తులపై పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయం వీధి, ఎస్సీ మర్రిగూడెం వీధుల్లో సర్వే చేపట్టారు. దరఖాస్తుదారులు సొంత స్థలం ఉన్నది లేనిది, ప్రస్తుతం ఎక్కడ నివాసం ఉంటున్నారు అనే తదిత అంశాలపై సర్వే నిర్వహించారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి


కాటారం : సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అఖిలపక్షం, గౌడ సంఘం నాయకులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని దమ్మన్నపేటలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఆయన ఆశయాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఏడునూతుల నిశీధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు లింగంపెల్లి ప్రసాద్‌రావు, మండల అధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి, నాయకులు మాత శంకర్, చిర్ర నర్సయ్య, సత్యంగౌడ్, కటంగూర్ సుదాకర్‌రెడ్డి, రాజు, అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**చిట్యాలలో...**

సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలని గౌడ సంఘం చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర శ్రీధర్‌గౌడ్ అన్నారు. మండల ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఆయన ఆశయాలను కొనియాడారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బుర్ర తిరుపతిగౌడ్, నాయకులు తడుక సుదాకర్, బుర్ర రమేష్, గాజర్ల మల్లేష్, బుర్ర రఘు, బొమ్మ శంకర్, బుర్ర చక్రపాణి, సత్యనారాయణ, సదానంధం, తదితరులు పాల్గోన్నారు.

కాటారం : పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను శుక్రవారం అఖిలపక్షం, గౌడ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఘనంగా నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా పలువురు మాట్లాడుతూ బహుజన వీరుడి జయంతిని అఖిలపక్షం ఆధ్వర్యంలో జరుపుకోవడం సంతోషకరమన్నారు. మహనీయులను పార్టీలుగా పంచుకొని చూడటం సరికాదని మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను పార్టీలకు అతీతంగా నిర్వహించాలని తెలిపారు. పాపన్న చేసే వృత్తిలో ఎన్నో అవమానాలను ఎదుర్కొని ఎస్సీ, ఎస్టీ, బీసీలను కలుపుకొని బహుజన సైన్యాన్ని ఏర్పాటు చేశారని, బహుజన రాజ్యాన్ని స్థాపించి గోల్కొండ కోటను ఏలిన గొప్ప మహనీయుడని కొనియాడారు. కాటారంలో పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుగుల రాజన్న, నియోజకవర్గ అధ్యక్షుడు రామిళ్ల రాకేశ్, గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు బుర్ర లక్ష్మయ్యగౌడ్, గాని సుధాకర్‌గౌడ్, మారగోని శంకర్ గౌడ్, వెంకట్రాజంగౌడ్, మాజీ సర్పంచ్ కారెంగుల తిరుపతిగౌడ్, తాటి బాపుగౌడ్, బొడ్డు రాజబాబు, మౌలానా, బీరెల్లి మహేశ్, పురుషోత్తం, బోడ బాపు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతి వేడుకలను మండల కేంద్రంతో పాటు పెద్దకోమటిపల్లిలో సర్వాయి పాపన్న మోకు దెబ్బ సంఘం, గౌడ సంఘము ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అయా సంఘాల వారు మాట్లాడుతూ పాపన్న గౌడ్ బహుజనులకు రాజ్యాదికారం కోసం ఎన్నో ఉద్యమాలను చేశారని పేర్కోన్నారు. ఆయన అశయాల కోసం గౌడ కార్మికులు ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ మోడె దర్మారావు, గౌడ సంఘము నాయకులు బత్తిని రమేష్ గౌడ్, వేముల మహేందర్ గౌడ్ బత్తిని స్వామిగౌడ్ ,బత్తిని బాలయ్యగౌడ్ ,వడ్లకొండ అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


రేగొండ మండలం, దమ్మన్నపేటలో....


చిట్యాల మండల కేంద్రంలో


మొగుళ్లపల్లి: పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

# జెడ్పీచైర్మన్ల కృషితో ఫారెస్ట్ అనుమతులు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మల్హర్: మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీచైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్‌ల కృషితో కిషన్‌రావుపల్లి ఫారెస్ట్ అనుమతులు వచ్చినట్లు మండల బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మండలంలోని తాడిచర్ల సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని పెద్దతూండ్ల కిషన్‌రావుపల్లి నుంచి భూపాలపల్లి వరకు ఫారెస్ట్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టడానికి శుక్రవారం చెన్నైలో జరిగిన ఫారెస్ట్ కమిటీ మీటింగ్‌లో అనుమతులు లభించినట్లు స్పష్టం చేశారు. 2014 సంవత్సరంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే అప్పటి ఎమ్మెల్యే పుట్ట మధు కృషితోనే తాడిచర్ల మానేరు నుంచి భూపాలపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాడానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాడని తెలిపారు. అనుమతులపై ప్రత్యేక దృష్టి సారించారని, అటవీ అధికారులను మెప్పించి, ఒప్పించి క్లియరెన్స్ తీసుకొచ్చిన ఘనత పుట్ట మధుకు, జక్కుల శ్రీహర్షినిలకు కృతజ్ఞతలు తెలిపారు. కానీ కొందరు కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌బాబు కృషితోనే అనుమతుల వచ్చినట్లు పేర్కొనడం హాస్యాస్పందంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాష్‌రావు, నాయకులు కోట రవి, యాదగిరిరావు, మండల కోఫ్షన్ సభ్యుడు అయ్యూబ్‌ఖాన్, కాళేశ్వర దేవస్థాన డైరెక్టర్ బండి రాజయ్య, నాగేశ్వర్‌రావు, బాలజీ, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు నెరవేర్చాలి


ధర్నాలో పాల్గొన్న బీజేపీ నాయకులు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తి రెడ్డి

భూపాలపల్లి రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి ఆరోపించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లకు పేదలకు పంపిణీ చేయాలనే డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బీజేపీ శ్రేణులు వినూత్నంగా ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కీర్తి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కేంద్రం భారీగా నిధులు కేటాయించినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వాటి నిర్మాణాలను ఇంకా పూర్తి చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఓట్ల కోసం తప్ప కేసీఆర్‌కు అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని, సంక్షేమం ఆయనకు పట్టదని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడిగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తోందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఓటు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే కాలంలోబీఆర్ఎస్ కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఉద్రిక్త పరిస్థితుల మధ్య కీర్తిరెడ్డిని, పార్టీనాయకులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ధర్నా కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు యుగేంధర్, రాష్ట్ర నాయకులు బట్టు రవి, రాంచంద్రారెడ్డి, నాయకులు ఏడునూతుల నిషీధర్ రెడ్డి, లింగంపల్లి ప్రసాద్‌రావు, పట్టణ అధ్యక్షులు సామల మధుసూదన్‌రెడ్డి. దొంగల రాజేందర్, విష్ణు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సత్యవతి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం


ఎంపీపీ రాణిబాయికి పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

- ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు
- పార్టీలో చేరిన మహదేవపూర్ ఎంపీపీ

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం సాధ్యమని రాష్ట్ర ప్రజలు, నాయకులు గుర్తించి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు, కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికార పార్టీకి చెందిన మహదేవ్‌పూర్ ఎంపీపీ రాణిబాయి-రామరావు దంపతులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ బాబు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు చేస్తున్న నియంతృత్వ పోకడలు నచ్చక కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు.

**కన్నతల్లి దగ్గరికి వచ్చినట్లుంది : ఎంపీపీ రాణిబాయి..**

పేద ప్రజల అభివృద్ధిలో పాలు పంచుకోవాలనే ఆలోచనతోనే కాంగ్రెస్ పార్టీలో చేరడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో శ్రీధర్‌బాబు గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మహదేవ్‌పూర్, కాటారం, మహాముత్తారం, భూపాలపల్లి, మల్హర్ మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సాగర్

చిట్యాల: మండలంలోని గోపాల్‌పూర్‌కు చెందిన ఇద్దరికీ ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా శుక్రవారం బాధితులకు జెడ్పీటీసీ గొర్రె సాగర్ రూ.35వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలబాలికలు అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టేకుమట్ల(రేగొండ): నిత్యం బాల, బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్(ఏహెచ్‌టీయూ) ఏహెచ్‌టీయూ కానిస్టేబుళ్ళు శ్రీనాథ్, ప్రవీణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏహెచ్‌టీయూ జిల్లా ఇన్‌చార్జ్ సీఐ పులి వెంకట్ ఆదేశాల మేరకు ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు బాలికలపై అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలని, ఉంటున్న, తిరుగుతున్న ప్రతీ చోట జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్నతనంలోనే పిల్లలు గంజాయి, సిగరేట్, మద్యం వంటి వాటికి బానిసలుగా మారి జీవితాలనే నాశనం చేసుకుంటున్నారని, కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్రె ప్రవీన్, ఉపాధ్యాయులు ప్రకాష్, రంగారెడ్డి, సదయ్య, తదితరులు ఉన్నారు.

# అనాథ శవానికి దహన సంస్కారాలు


దహన సంస్కారాలు చేస్తున్న పోలీసులు

భూపాలపల్లి అర్బన్: పట్టణంలో భిక్షాటన చేస్తూ గుండెపోటుతో మృతిచెందిన అనాథ శవానికి శుక్రవారం భూపాలపల్లి పోలీసులు దహన సంస్కారాలు నిర్వహించారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఉల్లాల నరసమ్మ జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో భిక్షాటన చేస్తూ శుక్రవారం గుండెపోటుకు గురైంది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. మృతురాలికి ఎవరూ లేకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేపట్టారు.

### మహిళా సమాఖ్య మండల కమిటీ ఎన్నిక


లావణ్య


సుజాత

భూపాలపల్లి అర్బన్: భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) నూతన మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోరిమి సుగుణ తెలిపారు. భూపాలపల్లి మండల అధ్యక్షురాలుగా గోలి లావణ్య, కార్యదర్శిగా చింతల సుజాత, ఆఫీస్ బేరర్స్‌గా గొట్టే సుమలత, సాదా మహేశ్వరి, కొండేటి జ్యోతిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

# పోలీసులకు తప్పని తిప్పలు


చలివాగు దాటుతున్న కానిస్టేబుళ్లు

టేకుమట్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చలివాగు వంతెనపై నిర్మించిన వంతెన కూలిపోవడంతో మండల కేంద్రానికి, వాగు అవతలి గ్రామాలకు రవాణా స్తంభించడంతో గతంలో రోజులు ముందుకొచ్చాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం స్థానిక పోలీసులు మహేందర్, రమేష్ వాగు అవతలి గ్రామాలైన రాఘవరెడ్డిపేట, కుందనపల్లి, ఎంపేడు గ్రామాలకు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల విషయమై చలివాగు నుంచి దాటుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతిరోజు రాఘవరెడ్డిపేట నుంచి మండల కేంద్రానికి పిల్లలు, వృద్దులు చలివాగును దాటుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన కూలి నెలరోజులు కావస్తున్నా ఇప్పటి వరకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయలేదని అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే సీతక్క


ఎస్ఎస్ తాడ్వాయి: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి : బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క శుక్రవారం అన్నారు. మండలంలోని బీరెల్లి, నర్సాపూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన జాజ సమ్మక్క, ఈసం సమ్మక్కల బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన అంకంపల్లి సర్పంచ్ సావిత్రి, బాలరాజులను పరామర్శించారు. నర్సాపూర్ గ్రామానికి చెందిన నాలి పుల్లమ్మ, జవ్వాజి రాజులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అపెండిక్స్ ఆపరేషన్ చేయించుకున్న కాటాపూర్‌కు చెందిన పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇందరాపు లాలయ్యను పరామర్శించారు. ఆమె వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ముజఫర్, సర్పంచ్‌లు ఇర్ప సునీల్ దొర, ఇర్ప అశ్విని సూర్యం, మంకిడి నర్సింహస్వామి, ఎంపీటీసీ జయమ్మ ఆనందం, జిల్లా నాయకుడు అరెం లచ్చుపటేల్, యూత్ మండల అధ్యక్షుడు కోడి సతీష్, తదితరులు ఉన్నారు.

**పరామర్శ**

ములుగు రూరల్: మండలంలోని జీవింతరావుపల్లికి చెందిఃఖో ఓ రిపోర్టర్ శరత్ తండ్రి సమ్మయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ములుగు ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. శుక్రవారం సమ్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, నల్లెల్ల భరత్, దేవ్‌సింగ్, సర్పంచ్ రత్నం భద్రయ్య, వంశీక్రిష్ణ ఉన్నారు.

### చిన్నారుల తిప్పలు

టేకుమట్ల(రేగొండ): సాయంత్రం కురిసిన వర్షంతో పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న పిల్లలకు తీవ్ర ఇబ్బంది ఎదురైంది. శుక్రవారం స్కూల్ వ్యాన్‌లో దిగి ఇంటికి వెళ్లే విద్యార్థులను కుటుంబ సభ్యులు గొడుగుల సాయంతో ఇంటికి తీసుకెళ్తూ ఒక వైపు స్కూల్ బ్యాగుల భారం, మరో వైపు వర్షంతో పిల్లలు ఇబ్బంది పడ్డారు.

# సీఐని సన్మానించిన బీజేపీ నాయకులు


సీఐ రాంనర్సింహారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

భూపాలపల్లి రూరల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా ధైర్యసాహసాలతో తన బాధ్యతను నిర్వహిస్తూ తోటి వారికి సాయం చేస్తూ.. ప్రజా ఆదరణ పొంది స్వాతంత్ర్య దినోత్సవ వేడుల్లో హైదరాబాద్‌లో సీంఎం కేసీఆర్ చేతుల మీదుగా భూపాలపల్లి సీఐ రాంనర్సింహరెడ్డి ఉత్తమఉద్యోగిగా అవార్డు అందుకున్న సీఐని పట్టణ బీజేపీ నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్బంగా పార్టీ అర్బన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వరద ముంపునకు గురైన మోరంచపల్లిలో సీఐ చేసిన సేవలను భూపాలపల్లి జిల్లా ప్రజలు గర్వంగా చెప్పుకుంటున్నారన్నారు. పార్టీ అర్బన్ ప్రధాన కార్యదర్శి తుమ్మేటి రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు కోరె సుధాకర్ పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో గేదె మృతి

మల్హర్: విద్యుదాఘాతంతో ఓ పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని కొండంపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తోటపల్లి రాజయ్య ఇంటి వద్ద ఉన్న విద్యుత్ స్తంభం వద్ద తీగలు తాకడంతో షాక్‌కు గురై మృతి చెందినట్లు పేర్కొన్నారు. దీని విలువ రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# ‘గిరిజన మహిళపై దాడి బాధాకరం’

ములుగు: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున గిరిజన మహిళపై పోలీసులు అకారణంగా చేయిచేసుకొని చిత్రహింసలకు గురిచేయడం అవమానీయం అని కాంగ్రెస్ పార్టీ ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన మహిళను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా లాఠీలు, బూటు కాళ్లతో దాడి చేయడం సర్వసభ్య సమాజం తలదించుకునేలా ఉందని అన్నారు.